కథానిక

# వెండితెరలోని బంగారం

పెనుమర్తి కామేశ్వరరావు

దర్శకుడు ఉమాకాంతం తాను తీయబోయే ప్రథమచిత్రంలోనికి నటీనటుల్ని ఏరుకోవడానికి ఆంధ్రదేశంలో కొన్ని పట్టణాలలో ఆ యా తేదీలలో వుంటానని దినపత్రికలలో ప్రకటించాడు. మద్రాసులో ఎందరో నటీనటులుంటే ఉమకాంతం నటీనటులకోసం బస్తీలవెంట తిరగడం ఆశ్చర్యకరమైన విషయమే. తక్కిన దర్శకులు క్రొత్తవారికి ట్రయినింగ్ నిచ్చి నటింపచేసే శక్తిలేక, పాతనటులనేతీసుకుని ప్రజలు పలుసార్లు చూచిన ముఖాలనే మళ్ళీ వారికి చూపుతున్నారని ఉమాకాంతం భావించి, ప్రజానీకంలోనుంచి నటనానుభవంలేనివారిని తన టాకీలో చక్కగా నటింపచేసి తన ప్రత్యేకతను నిరూపించుకొనడానికి నిశ్చయించుకున్నాడు. క్రొత్తతారలనైతే ప్రజలు చూడడానికిరారని అతను భయపడలేదు. కథ, సంభాషణలు, పాటలూ తానే వ్రాస్తాడు, దర్శకత్వం తానే నిర్వహిస్తాడు. టాకీ విజయం తనమీదనేఆధారపడియుందని అతనిఅభిప్రాయం.

ఉమాకాంతానికి గుంటూరుజిల్లాలో రమాకాంతం అనే మేనల్లుడున్నాడు. అతను దినపత్రికలలోపడిన ప్రకటనచూచి, ఆనందభరితుడై, మునిసిపల్ ఎన్నికలకోసం ప్రచారంచేసిన కుర్రాళ్ళనిమాట్లాడి వాళ్ళకు నోట్లాలిచ్చి, వాటిద్వారా వీధి వీధినా దర్శకుడు ఉమాకాంతం రాకగురించి ప్రచారంచేశాడు. "సినిమాలలో నటించాలని కోరికగల స్త్రీ-పురుషులందరూ ఒకటవ తారీకున ట్రావెలర్స్ బంగళాలో దర్శకుడు ఉమాకాంతం గారిని కలుసుకొన ప్రార్థన!"అని కుర్రాళ్లు కేకలు పెట్టారు. అందువల్ల ఆబాలగోపాలానికి ఉమాకాంతం రాకగురించి తెలిసి యువతీయువకుల్లో మిక్కిలి ఉత్సాహాన్ని రేకెత్తించింది. పట్టణాలలోనేగాక, వాటికి సమీపంలోగల పల్లెటూళ్ళకు గూడా యీ వార్త ప్రాకింది.

ముఖ్యంగా రమాకాంతం స్నేహితుల ఉత్సాహానికి అంతేలేదు. వాళ్ళందరూ సినిమాకు బుక్ అయినట్లుగానే ఆనందపడ్డారు.

ఉమాకాంతం తెల్లవారుజామున వచ్చే మెయిలులో వస్తాడని రమాకాంతం అతని స్నేహితులిద్దరూ స్టేషన్‌కు కారు తీసుకవెళ్ళారు. మెయిలులో సెకండుక్లాసునుంచి ఉమాకాంతం చేతిలో స్టేట్‌ఎక్స్‌ప్రెస్ సిగరెట్లు డబ్బాతో దిగగానే మేనల్లుడు కనిపించి "మామయ్యా!" అని కేకపెట్టి దగ్గరకు వెళ్ళాడు.

"నేను వచ్చినపని సానుకూలమవుతుందని నీకేమైనా నమ్మకం ఉందిరా? ఈవూళ్ళో చాలామంది స్టేజియాక్టర్లున్నారని విన్నాను. దినపత్రికలలో నేను ప్రకటించిన టూర్ ప్రోగ్రాం వాళ్లంతా చూచారో లేదో!" అన్నాడు ఉమాకాంతం.

"నేను, నా స్నేహితులు మెగఫోన్లతో వీధి వీధినా మీ విషయం ప్రచారం చేశాం మామయ్యా! నిన్ను కలుసుకోవడానికి సుమారు రెండుమూడువేలిమంది స్త్రీపురుషులు వస్తారు.' అన్నాడు కాంతం.

"రెండుమూడువేలమందే! అయితే గల్లంతు జరగకుండా చూడాలంటే, మనకి పోలీసు సహాయం కావాలి! ఈవూరి సబ్ ఇన్స్పెక్టరు మంచివాడేనా?" అన్నాడు ఉమాకాంతం.

"చాలా మంచివాడు. అతనూ నా స్నేహితుడే! ఉదయం వెళ్ళి మాట్లాడివస్తాను. ఓ పది మంది కాన్‌స్టేబిల్స్‌ని పంపమని చెబుతాను. వాళ్ళకి బేటాయిస్తే సరిపోతుంది!" అన్నాడు మేనల్లుడు.

"నువ్వు మంచి తెలివిగలవాడివిరా! ఊళ్ళో పోయి ఓటాక్సీ మాట్లాడుకురాగలవూ!"అన్నాడు ఉమాకాంతం.

"కారు తెచ్చాను మామయ్యా! దర్శకుడు గుర్రంబండి ఎక్కడని నాకు తెలుసు మామయ్యా! వీళ్ళిద్దరూ నా స్నేహితులు. ఇతను కృష్ణమూర్తి-హోటలు ప్రొప్రయిటరు. ఇతను కామ్రేడ్ గోపాలం-యువజన సంఘ కార్యదర్శి. వీళ్ళిద్దరూ మనకి చాలా సహాయంగా ఉంటారు!" అన్నాడు రమాకాంతం.

"వీళ్లు సరే! ఈ రోజుల్లో ధనం కోమట్ల దగ్గరా, కమ్మవారిదగ్గరా మూలుగుతోంది. ఆ రెండు వర్గాల నుంచీ కొందరు యువకుల్ని మనం ఆకర్షించాలి. మనం ఏకంగా ఒక స్టుడియోకూడా నిర్మించడానికి షేర్లు అమ్మతున్నాం. షేరు ఒకటికి వెయ్యి రూపాయలు!" అన్నాడు దర్శకుడు సిగిరెట్టు ముట్టించి.

"ఈ వూళ్ళో ఓ యాభై షేర్లు అమ్మ వచ్చండీ!" అన్నాడు కృష్ణమూర్తి ఉత్సాహంతో.

"రైట్. మీరంతా సాయంచేస్తే, నా పని సులభమవుతుంది" అన్నాడు ఉమాకాంతం.

ఉమాకాంతం, అతని సెక్రటరీ శామ్యూల్, రమాకాంతం, అతని మిత్రులిరువురూ కారులో ఎక్కి ట్రావెలర్స్ బంగళాకు వెళ్లారు. వెంటనే కృష్ణమూర్తి తనహోటల్ నుంచి అందరికి టిఫెన్, కాఫీ, కిల్లీలు తెప్పించాడు కారులో వెళ్ళి. అతను ముప్ఫయి సంవత్సరాలయువకుడు. మంచి ఉత్సాహంకలవాడు. టిఫిన్ తిని, కాఫీ త్రాగి ఉమాకాంతం "కృష్ణమూర్తిగారూ! మావద్ద పదికప్పులకాఫీపట్టే ఫ్లాస్కు వుంది. దానినిండా కాఫీ అచ్చంగా ఇటువంటిదేపోయించి పంపండి. మధ్యాహ్నం ఒంటిగంటకు పదిమందికి మంచి భోజనం స్పెషల్ గా చేయించి పంపండి. మేమిక్కడ అయిదు రోజులుంటాము. మీ బిల్లు వెళ్ళేముందు ఇచ్చేస్తాం" అన్నాడు.

"బిల్లుకేంలెండి! కాస్త మీరు కనికరించి నా తరపున ఒక స్త్రీ వుంది. ఆమెని మీ పిక్చరులోకి తీసుకోవాలి!" అన్నాడు కృష్ణమూర్తి వినయవిధేయతలతో.

"చూడాలి. సినిమాకు సూట్ అయే మనిషైతే ఆలోచిస్తాను. మావాడి అంచనాప్రకారం రెండుమూడువేలమంది వస్తారు! వీరిలో ఎంత మంది పనికివస్తారో చెప్పడంకష్టం!" అన్నాడు దర్శకుడు.

"నా తరఫు మనిషి సంగీతం పాడగలదు. చక్కనిది. మంచిపుష్టిగావుంటుంది!" అన్నాడు కృష్ణమూర్తి.

"సినిమాకు ఉత్త అందంచాలదు. గొంతు మైక్ కి సూట్ కావాలి. ప్రొఫైల్ బాగుండాలి" అన్నాడు ఉమాకాంతం సినిమాల మాటలు విసురుతూ.

కృష్ణమూర్తి నమస్కరించి ఫ్లాస్కు తీసుకు వెళ్ళాడు.

ఉదయం ఏడుగంటలకే బంగళా ఆవరణలో స్త్రీ పురుషులు నూత్నవస్త్రాలు ధరించి ప్రోగవుతున్నారు. రమాకాంతం ఉత్సాహానికి మేరలేదు. తనూ, తనమిత్రులూ గ్రామంలో నలుమూలలా చేసిన ప్రచారం బాగా పనిచేసిందని ఆనందపడ్డాడు.

"చూశావా మామయ్యా! ప్రజల్ని తొమ్మిది గంటలకు రమ్మంటే, ముందుగానే వస్తున్నారు. ఈ ప్రాంతంలో సినిమా పిచ్చి అమితజాస్తి. నే వెళ్ళి సబ్ ఇనస్పెక్టర్ ని, కానిస్టేబిల్స్ ని పిల్చుకు వస్తాను." అన్నాడు రమాకాంతం.

"తుపాకులతో రమ్మను. వాటిల్లో గుళ్లు లేకపోయినా, ఉత్త తుపాకులున్నా ప్రజలు భయపడతారు. తెలిసిందా? అన్నాడు ఉమాకాంతం దూరంగా ఉన్నవాళ్లు దగ్గరగా కన్పించే "టెలిస్కోప్ తో" ప్రజల్ని పరికిస్తూ.

రమాకాంతం కారులో పోలీసు స్టేషన్ కి పోతూ వస్తున్న జనులతో "అల్లరి చేయకుండా కూర్చోండి: ఇప్పుడే దర్శకుడు వస్తాడు!" అని చెప్పి వెళ్లాడు.

మంచి శరీర సౌష్టవంగల గుర్రంబండ్లవాళ్లు కాఫీ హోటళ్ల సర్వర్లూ, అచ్చాఫీసుల్లో పనిచేసే కుర్రాళ్ళూ, కాలేజివిద్యార్థులూ, రకరకాల ఫ్యాషనుల దుస్తులు ధరించి ఒక మహానాయకుడి దర్శనము కోసం వస్తున్నట్లు వందల సంఖ్యలో వస్తున్నారు బంగాళా ఆవరణలోకి. ఇక స్త్రీలుకూడా జాస్తిగానే వస్తున్నారు. వారిలో పల్లెటూరివారు కూడా వున్నారు. దర్శకుడి దృష్టి, కరుణా ఎవరి మీద ప్రసరిస్తుందో ఎవరికి తెలుసుగనక-పట్టణంలోని అన్నివర్గాల స్త్రీలు వస్తున్నారు. కొందరి తిరునాళ్ళని చూచే నిమిత్తం వస్తున్నారు. ఎనిమిది గంటలకల్లా పోలీసులు వచ్చి, పురుషుల్ని

ఒక క్యూలో, స్త్రీలని ఒక క్యూలో నిలబెట్టారు.

క్రిష్ణమూర్తి తనతరఫు మనిషిని తీసుకురాలేదు. ఈ జనసమూహం తగ్గిన తరువాత ఒంటరిగా తీసుకువద్దామని నిశ్చయించుకున్నాడు. వచ్చిన స్త్రీలలో కళావంతులు - నాటకాలలో వేషాలు ధరిస్తున్న స్త్రీలున్నారు. కేవలం పల్లెటూళ్ళనుంచి వచ్చిన వాళ్ళలో స్వేచ్ఛాజీవులు, భర్తలనుంచి విడిపోయినవాళ్ళు ధైర్యముతో వచ్చారు. వారి ముఖాలలోని నేవళంలోని అమాయికత్వం, వారి ఉత్సాహం చాలా చిత్రంగా నుంది. వివిధ దినపత్రికల విలేఖరులు, గ్రామంలోని కొందరు అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్లు కూడా వచ్చారు. ఈ జనులందరి ఉపయోగార్థం బంగళా ఆవరణాలోకి కిల్లీషాపులూ, సోడా లబళ్ళూ, మిఠాయిదుకాణాలు వచ్చాయి. పత్రికలపేర్లు కేకలు పెడుతున్నారు. కాలక్షేపం కోసం కొందరాపత్రికలుకొని అందులోని సినిమా తారల చిత్రాలుచూచి, తాము కూడా అంత అదృష్టవంతులు కావాలని వూహించుకొంటున్నారు.

ఎండలో స్త్రీ పురుషు లెందరో నానాఅవస్థలూ పడుతూ నిలబడివుండగా, ఉమాకాంతం వేడి నీళ్ళ స్నానంచేసి ఖద్దరుధోవతీ, ఖద్దరు లాల్చీ ధరించి, కళ్ళజోడు తుడిచిపెట్టుకుని, మరల ఓ కప్పు కాఫీత్రాగి, సిగిరెట్టు ముట్టించాడు.

"ఒరేయి కాంతం! ముందాడవాళ్ళని ఒక్కొక్కరినే నెమ్మదిగా రమ్మని చెప్పు. ముందు వాళ్ళనిచూచి ఇళ్ళకు పంపివేయడం మంచిది. వాళ్ళా ఎండలో నిలబడి పడుతున్న శ్రమంతా వృథా అని నాకు తెలుసు. అయినా-అంత మందిలో నాకు ఓ యిద్దరేనా నచ్చకపోతారూ. మద్రాసులో తార లెవరికీ ఓపికలు లేవు. వాళ్లు కేవలం పౌడర్లతో, అందమైన చీరెలు,జాకెట్లతో తమ జీవితాలను హాయిగా వెళ్ళదీస్తున్నట్లు కనిపిస్తారు. హిందీతార సంధ్యవంటి మనుషులు కావాలి. అమరభూపాలీలో ఆమె ఎంత చక్కగా నటించింది!" అన్నాడు ఉమాకాంతం.

రమాకాంతం గొట్టంలో బిగ్గరగా చెప్పాడు. ఆడవాళ్ళు రావచ్చుననీ-ముందాడవాళ్ళని చూడడానికి దర్శకుడుచెప్పే కారణాలు! ఆడవాళ్ళ క్యూ కదిలింది: ఒకరొక్కరే బంగళా వసారాలోకి వస్తున్నారు. ఉమాకాంతం, శామ్యూల్ రెండు కుర్చీలు వేసుకు కూర్చున్నారు. వారికి మధ్యలో ఓకుర్చీ వేసివుంది. ఆ కుర్చీలో ప్రతిస్త్రీ ఒకసారి కూర్చుంటుంది. వెంటనే ఉమాకాంతం "ఒకసారి నవ్వు-అటుచూడు ఇటుచూడు విచారంగా ముఖంపెట్టు" అనడం, ఈ సర్కస్ కాగానే "నువ్వు వెళ్ళవచ్చు!" అనడం! ఇలా క్యూలో నుంచి వచ్చిన ఏభైమంది వచ్చి వెనక్కి వెళ్ళిపోయినారు. వాళ్ళందరూకూడా నేటి తెలుగు సినిమాలు తరుచు చూస్తున్నవాళ్లు కావడంవల్ల తమ గుండెబలాన్ని ప్రదర్శిస్తూ, దర్శకుడిచేత బుక్ కావడానికి నానాఅవస్థలూ పడ్డారు. తమ సెక్సప్పీలుతేనాన్ని ప్రదర్శించినా దర్శకుడికి నచ్చకపోవడంవల్ల వాళ్ళ ముఖాలు ముడుచుకపోయినయి. నిలబడివున్న పురుషులీ చిత్రాన్ని జాగ్రత్తగా కళ్ళార్పకుండా కనిపెడుతూ, తమ వంతెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు ఏభయిమంది అయిపోయిన తరువాత వరసగ అచ్చంగా పల్లెటూరి ఆడవాళ్లు రాసాగారు వారిలో ఒకతె నల్లగానున్నప్పటికీ, మంచి చా: దేలిన టేకి దూలంవంటి బలిష్ఠకాయురాలు చక్కని వక్షోజోల్బణం కలిగినమనిషి వచ్చి కుర్చీలో కూచునేసరికి ఉమాకాంతానికి గుండె దడదడ కొట్టుకుంది. అందరినీ అడిగిన ప్రశ్నలడిగినపిదప ఉమాకాంతం "నీ పేరేమిటి? అన్నాడు.

"సుబ్బాం! అంటారు మావోళ్లు. అందరు సుబ్బమ్మ అని పిలుస్తారు దొరా!" అన్నది.

"నీవు చదువుకున్నావా?" అన్నాడు ఉమాకాంతం.

"చదువురాదు. నాబోటిదానికి సదువేంటి? అన్నది సుబ్బమ్మ.

"నీవేం చేస్తుంటావు?" అన్నాడు ఉమాకాంతం.

"కూలిపని చేస్తుంటాను: గడ్డి కోసితెచ్చి యిళ్ళల్లో గుర్రం బళ్ళవాళ్ళ కమ్ముకుంటాను అన్నది సుబ్బమ్మ.

"నీ భర్త ఒప్పుకుంటాడా నీవు సినిమాలో నటిస్తే!" అన్నాడు దర్శకుడు.

"నాకు భర్తలేడు. నన్నొకడుంచుకుండాః

ఆడే మీయొద్దకు పొమ్మన్నాడు!" అన్నది సుబ్బమ్మ.

"వాడిక్కడ వున్నాడా. వాడినికూడా తీసుకుంటాం!" అని ఉమాకాంతం శామ్యూల్‌ని దాని పేరు, అడ్రెసు తీసుకోమని వసారాలోనున్న ఒక బల్లమీద దాన్ని కూర్చోమన్నాడు.

ఇదంతా చూస్తున్న ఆడ, మగ జనంలో సంచలనం బయలు దేరింది. "దాన్ని సినిమాలోకి తీసికొన్నారు! ఆ నల్లది ఆయన కళ్లకు రంభలాగున కనిపించింది కాబోలు!" అనుకున్నారు. అంతకు ముందు పరీక్షింపబడినవారు ఉమాకాంతం యొక్క మనస్తత్వం తెలియక అతన్ని మనసులో తిట్టిపోశారు. ఎవరినైతే చాలా ప్రశ్నలు వేసి, పేరు రాసుకుని బల్లమీద కూచోపెడతారో వాళ్లందరూ బుక్ అయినట్లుగా భావించడానికి వీలయింది. తరువాత ఆడవాళ్లు ఇంకా రాసాగారు. వాళ్లు చాలా వుత్సాహంగా సినిమా పోజులు పెడుతూ—కొందరు యస్. వరలక్ష్మి, కొందరు సావిత్రి, కొందరు శాంతకుమారి, సూర్యకుమారి, కుమారి, శ్రీరంజని మోస్తరుగా నవ్వడానికి ప్రయత్నించసాగారు. వాళ్లంతా గ్రామంలోని కళావంతులు—నాటకాలలో వేషం వేసి వేసి యౌవనమంతా హరించిపోయి, ప్రాణావశిష్టులై వున్నవాళ్లు. ఇంకో వందమంది తరవాత ఉమాకాంతానికి మరొకతె నచ్చింది.

"మీరెవరు?" అన్నాడు ఉమాకాంతం.

"వడ్డి ఉప్పరులం! కాయకష్టం చేస్తుంటాం" అన్నది ఆమె. ఆమె ముతక గుడ్డ కట్టుకుంది. వంటిమీద రవిక కూడా లేదేమో-ఆమె అందం మరీ కొట్టవచ్చినట్లుగా కనిపించింది దర్శకుడికి!

"నీ పేరేమిటి?" అన్నాడు ఉమాకాంతం.

"వెంకాం!" అన్నది.

"నీ భర్త వున్నాడా?" అన్నాడు దర్శకుడు.

"ఉన్నాడు—కాని వాణ్ణి వదిలేశాను. ఇప్పుడు ఉప్పరిపనికి పోవటంలేదు!" అన్నది వెంకాం.

వెంటనే దర్శకుడు శామ్యూల్‌ని దాని పేరు, చిరునామా వ్రాయమన్నాడు. దానిని వెళ్ళి సుబ్బమ్మ ప్రక్కన కూర్చోమన్నాడు. ఖరీదైన చీరెలు, నగలు ధరించి వచ్చిన అందకత్తెలందరికీ అమితాగ్రహం కలిగింది-దర్శకుడి అభిరుచి చూచేసరికి! కొందరికి అనుమానం కూడా కలిగింది: నిజంగా యీ ఆడవాళ్ళు సినిమాలోకి కొనిపోబడుతున్నారా - లేక ఏదైనా వేశ్యావాటికకి పోతున్నారా అని సందేహం కలిగింది.

దర్శకుడు తక్కిన స్త్రీలందర్నీ చూడటం అనవసరమని భావించి వాళ్లని ఇళ్ళకి వెళ్ళిపొమ్మని పోలీసులచేత చెప్పించాడు. కాని స్త్రీల కిదేమీ అర్థంకాక ముందుకే రాసాగారు. అప్పుడు రమాకాంతం గొట్టంలోనుంచి బిగ్గరగా చెప్పాడు: "దర్శకుడు ఇరువురు స్త్రీలను బుక్ చేశారు. వారి కిద్దరు చాలుట! తక్కినవారంతా యిళ్ళకు పొండి. ఇక పురుషులు రావాలి!" వెంటనే పురుషుల క్యూ కదిలింది.

మొట్టమొదటివాడు వచ్చి కుర్చీలో కూర్చుని దర్శకుడివైపొక నిండు చూపు చూచాడు హాస్యనటుడివలె! అతన్ని పరకాయించి చూచి ఉమాకాంతం "మేము స్టుడియో ఒకదానిని నిర్మించడానికి షేర్ల నమ్ముతున్నాము. షేరు ఖరీదు వెయ్యి రూపాయలు. అందులో సగం సొమ్ము ముందు చెల్లించాలి. మిగతాది రెండు మాసాలలో చెల్లించవచ్చు. ఈ షేర్లు పుచ్చుకున్నవారిని మాత్రమే మేం సినిమాలో నటింపచేస్తాం" అన్నాడు.

"నావద్ద డబ్బులేదు. డబ్బున్నవాళ్లు నా వెనక వున్నారు. వాళ్లని కనుక్కోండి" అని అతడు వెళ్లిపోయాడు.

ఉమాకాంతం పురుషులలో ప్రతి ఒక్కరితో షేర్లగురించి చెప్పడం మాని, రమాకాంతాన్ని పిలచి "షేర్లు తీసుకున్నవారికే సినిమాలో నటించే ఛాన్సు. తక్కినవారికి లేదు!" అని గొట్టం ద్వారా అరవరా! కావలసినవాళ్లుంటారు లేని వాళ్లు వెళ్ళిపోతారు. పన్నెండు గంటలు కావస్తోంది. భోజనాలవేళ తప్పిపోకుండా పాపం, ఇళ్లకి పోతారు" అన్నాడు.

రమాకాంతం ఆ విధంగా అరిచాడు. దాని సారం తెలుసుకుని పురుషులలో ఎక్కువ మంది వెలవెలబోయి గృహోన్ముఖులైనారు. అందరూ పోగా నలుగురు యువకులు మాత్రం షేర్లు తీసుకుంటామని ముందుకు వచ్చారు.

* * *

దర్శకుడు ఆ నలుగురు యువకుల ముందు కూర్చొని జాతీయ అంతర్జాతీయ చిత్ర పరిశ్రమ

నంతా సమీక్షిస్తున్నాడు. శాంతారాం, సొహ్రాబ్ మోడీలకు దర్శకత్వంగూర్చి ఏమీ తెలియదన్నాడు. ఏవేవో కబుర్లుచెబుతూ, సిగిరెట్లు కాలుస్తూ, భోజనంకోసం ఎదురుచూస్తుండగా' ఒకడు బంగళాముందు తారట్లాడసాగాడు. ఆడవాళ్ళిద్దరూ వసారాలోనుంచి వెళ్ళి లోపల స్నానాలగదిలో వున్నారు. అయిదారుసార్లు చూచినమీదట ఉమాకాంతం "ఎవరబ్బాయ్! నువ్వు?" అని ప్రశ్నించాడు.

"నా మనిషిని మీరు సినిమాలోకి తీసికెళ్తుండారని విని యిటువచ్చాను! మీరు దయతలిస్తే దానెంట నేగూడావస్తాను!" అన్నాడు అతను. అంతట దర్శకుడు—"ఏయ్! సుబ్బమ్మా! ఇటురా! నీకోసం ఎవరోవచ్చారు" అన్నాడు.

అంతట సుబ్బమ్మ బైటికివచ్చి తన ప్రియుడు కోటప్పనిచూచి సంతోషం పట్టలేకపోయింది. వసారాలోకి పోయింది.

"నా అదృష్టంబాగుంది, నన్ను తీసుకున్నారు. నన్నిక్కడే బువ్వతినమన్నారు. సాయంత్రం యింటికివస్తాను" అన్నది సుబ్బమ్మ! కాని కోటప్పకి సంతోషంకలగలేదు.

"నాసంగతేంటి చెప్పు? నేవెంటలేంది నువ్వు పోడానికి నేనొప్పను- తెలిసిందా?" అన్నాడు కోటప్ప.

"నాయెంటను వ్వేందుకంట?"అన్నదిసుబ్బమ్మ.

"ఒసేవ్! కాసేపట్లోనే కళ్ళు నెత్తికొచ్చి నాయే! చూసుకో నిన్నేంజేస్తానో!" అని గుడ్లురిమాడు కోటప్ప.

సుబ్బమ్మ ఘన జఘన భారంతో పరిగిడుతూ వచ్చి "అయ్యగారూ! ఆడ్ని పంపించేయండి! ఆడికోరూపాయి పారేయండి, పోతాడు!"అన్నది తొందరగా.

ఉమాకాంతం వసారాలోకి వచ్చి "ఏమిటి సంగతి?"అని ఒకపోజుపెట్టి తీక్షణంగా కోటప్ప వైపు చూశాడు.

"అయ్యగారూ: దానితో నేకూడా రావాలి సిందే!"అన్నాడు కోటప్ప దీనంగా అర్థిస్తున్నట్లు.

"నీ గుర్రంబండీ ఏంజేస్తావు? కొన్నాళ్లు పోయింతరవాత నీపేర ఉత్తరంరాసి నిన్ను పిలిపిస్తాం మద్రాసుకి.నీకిప్పుడేమైనా డబ్బుకావాలా" అని జేబులోనుంచి పర్సుతీసి రెండు రూపాయల కాగితంతీసి వాడిమీదికి విసిరాడు. వాడు దాన్ని తీసుకుని కళ్ళద్దుకుని, జేబులో పెట్టుకుని వెళ్లాడు నవ్వుతో.

తరవాత హోటలునుంచి పదిమందికి భోజనం వచ్చింది. భోజనంతోబాటు లడ్లు, ఆవడలు కూడా పంపాడు కృష్ణమూర్తి. దర్శకుడు, శామ్యూల్, రమాకాంతం, సబ్ ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి, ఆ యువకులు నలుగురు, స్త్రీలిద్దరూ ఏకపంక్తిని భోజనంచేశారు. మురికిగుడ్డలలోవున్న స్త్రీలిరువురిని తారలవలె సింగారించడానికి దర్శకుడు రమాకాంతాన్ని పిలిచి"ఒరేయ్! బజారు కెళ్ళి ఈవందరూపాలతో ఆడవాళ్ళిద్దరికీ చీరెలు జాకెట్లు, బాడీలు, సబ్బులు, ఫేస్ పౌడర్లు, రిబ్బన్లు దువ్వెనలు, అద్దాలు, పూలు అన్నీ పట్టుకరా! వాళ్ళని తారలుగా మేకప్ చేయాలి!"అన్నాడు. రమాకాంతం నవ్వాడు: నల్లని తుమ్మమొద్దులవంటి స్త్రీలు మామయ్యకంటికి నచ్చడం అతనికాశ్చర్యాన్ని కలిగించింది. గ్రామంలోగల ఆడపిల్లల నూ్కలు ఉపాధ్యాయినులందరూ వస్తే-వాళ్ళ మొగమైనా చూడకుండా, వాళ్ళని వెళ్ళిపొమ్మన్నాడు. ఇందులో ఏదో రహస్యం ఉండి వుంటుంది, అనుకున్నాడు.

"చీరెలన్యాయం నాకేంతెలుసు మామయ్యా! నువ్వు కూడావస్తే బావుంటుంది!" అన్నాడు రమాకాంతం.

షేర్లు తీసుకొన నిశ్చయించిన నలుగురు యువకుల్ని మొత్తంగా సంబోధించి "నేనిక్కడ నాలుగురోజులుంటాను. ఈలోపున మీరు డబ్బు సిద్ధంచేసి తీసుకురండి. మీరు చాలా పనులుంటయి. మీరిక వెళ్ళవచ్చు"అని వారికి విడో్కలిచ్చిపంపాడు. ఓగంటసేపు మేనువాల్చినపిమ్మట ఉమకాంతం సబ్ ఇనెస్పెక్టరు వీరాస్వామిని ఆయన సేవనూ ప్రశంసించి, "ఇక మాకు పోలీసుల సహాయం అవసరంలేదు"అన్నాడు. అతను డబ్బు తీసుకొని సెల్యూట్ చేసి వెళ్ళిపోయినపిమ్మట, ఉమాకాంతం మేనల్లుడితో కలిసి ఒక గుర్రంబండి నెక్కి- బజారుకి వెళ్ళి కోయంబత్తూరు చీరెలు నాలుగు రంగులలో నాలుగు కొన్నాడు. ఇంకా ఇతర టాయిలెట్ సామానులన్నీ కొని తీసుకు వచ్చాడు. ఆ స్త్రీలను తారలుగా తయారు చేసేటప్పుడు ఇతరులు ఉండకూడదని

నిశ్చయించి ఉమాకాంతం మేనల్లుడితో, "నువ్వు సాయంత్రం అయిదు గంటలకు రా! తెల్లవారు జామునుంచి నాకోసం నువ్వు చాలా కష్టపడ్డావురా! నీసహాయం ఎన్నటికీ మరిచిపోలేను. నిన్ను నాకింద సహాయ దర్శకుడిగా తీసుకుంటాను. రేపు ఒకసారి మీ యింటికి వచ్చి, మీ అమ్మతో మాట్లాడుతానని చెప్పు. ఈ అయిదురూపాయలు నీదగ్గరుంచుకో!" అని డబ్బిచ్చి పంపాడు.

ఉమాకాంతం స్వయంగా సుబ్బమ్మకు, వెంకమ్మకు మేకప్‌చేసి, వాళ్ళెలా నిల్చోవాలో, ఎలా చూడాలో మొదలైన విషయాలన్నీ బోధచేయసాగాడు. యథార్థంగా తాను దర్శకత్వం ఆరంభించాడు.

"మీ పేర్లుకూడా మార్చేస్తాను. సుబ్బాం పేరు రత్నప్రభ, వెంకాం పేరు ఉషారాణి అంటే బాగుంటుందని నాకు తోస్తున్నది" అని తన శెక్రెటరీ వైపు చూచాడు. అతడు తన అంగీకారాన్ని సూచించి "వీళ్ళని మీరు తీసుకోవడం వల్ల ప్రజలందరికీ ఆశ్చర్యం, ఆశాభంగం కలిగాయి. నిజంగా మీ కళాదృష్టి అసమానమండీ కాంతంగారూ! చదువైన్నా రాని వీళ్ళిరువురితో మన ప్రయత్నం విజయవంతమవుతుందన్న నమ్మకము నాకు కలుగుతోంది. అందమైన దుస్తులు ధరించితే వాళ్ల శరీరపు నలుపుదనం విరిగిపోతున్నట్లనిపిస్తున్నది. సరైన పోషణ గనక వుంటే వీళ్ళు ఒకనెలలో అద్భుతంగా తయారవుతారు. శరీర సౌష్టవమే స్త్రీకి ముఖ్యం!" అన్నాడు శామ్యూల్.

"ఈ వూళ్ళో షేర్లద్వారా వసూలయే డబ్బుతో వీళ్లిరువురికి మెళ్లోకి నెక్‌లేసులు కొనాలనుకుంటున్నాను. రత్నప్రభ తాలూకు మనిషిని వదిలించుకుంటే మనం గట్టెక్కినట్లే. ఉషారాణికి మనం తప్ప చెప్పుకోదగ్గ దిక్కేమీలేదు. వీళ్ళలో కొన్ని ప్రత్యేక ఆకర్షణలున్నాయి. వీళ్ళ చూపులు మన్మధుని తూపులు! ముఖాలు ఫోటోగ్రాఫీలో చాలా అద్భుతంగావుంటాయి. తారల్ని ఫోటోగ్రఫీ దృష్టితో చూడాలిగాని, వాళ్ళు విడిగా అందంగా ఉన్నారా లేదా అనేది నాకనవసరం. మనషేర్లు తీసుకోదలచిన నలుగురు కుర్రాళ్లనూ కనిపెట్టాను. వాళ్ళు వీరిద్దరి ఆకర్షణలో ఒక లక్ష రూపాయిలు దాకా పెట్టుబడి పెట్టగలరు. ఆ నల్లటుబ్బాయి-అతను కమ్మవారి చిన్నవాడు. అతనికి నూరెకరాల మాగాణీ భూమి ఉందిట! అతన్ని ఎలాగైనా రంజింపచేసే ఉపాయం వీళ్లలోనే వుంది." అన్నాడు ఉమాకాంతం. అతను బయలుదేరిన పని ఒకటి, ప్రజలనుకుంటున్నదొకటి. ప్రజలతను తారల్ని బుక్ చేయడానికి వచ్చినట్లు భావించారు. అతను చిత్రనిర్మాత దొరకక దేశంమీద డబ్బు వసూలు చేసి టాకీ తీయాలనుకున్నాడు. అతని ఆజానుబాహు విగ్రహం, వేషం, మాటలు చూచి ఎవరైనా సులభంగా అతనివలలో పడతారు. అతను మద్రాసు నుంచి బయలు దేరడం కొద్దిడబ్బుతో బయలు దేరాడు. త్వరగా ఏ అమాయకులైనా షేర్లు తీసుకొని కొంత డబ్బిస్తేనే అతని భవిష్యత్కార్యక్రమం సాగగలదని అతనికి మాత్రమే తెలుసు!

* * *

మధ్యాహ్నం మూడుగంటలయేసరికి క్రిష్ణమూర్తి స్వీటు, హాటు టిఫిన్లు, కాఫీ మొదలైనవి పంపి, కొంతసేపటికి తన తాలూకు స్త్రీతో గుర్రం బండిలో బంగళాకు వచ్చాడు. వాళ్ళు వచ్చే సమయాన తారలిరువురు, దర్శకుడు ఒక టేబిలుమీద టిఫిన్ తింటున్నారు. రత్నప్రభ, ఉషారాణి మధ్యాహ్నం లగ్గు, ఆవడలతో సుష్టుగా తమ జీవితంలో ఎరుగని భోజనంచేసి, టిఫిన్‌కు హాజరైనారు. వాళ్లకిక జీవిత పర్యంతం ప్రతిక్షణం అదే విధంగా జరుగుతుందనే ఆశ పొడుకుంది.

పెద్దహాలులోకి సరాసరివచ్చారు క్రిష్ణమూర్తి ఆయన పోషణలోనున్న ఆండగత్తె. వాళ్ళిరువురు టిఫిన్లు తింటున్న తారల్ని చూచారు. ఆకాశం మేఘాచ్ఛాదితమై యుంటంవల్ల బంగళాగదుల్లో విద్యుద్దీపాలు వెలిగించారు. ఆ విద్యుద్దీపశోభలో సుబ్బాం, వెంకాం వారు ధరించిన దుస్తులు తళతళ మెరిసిపోతున్నయ్. బజారులో పెదిమలకు వేసే రంగు లభించనందున వారి పెదిమలు మామూలుగానే ఉన్నాయి.

కృష్ణమూర్తిని చూచి ఉమాకాంతం "ఆ కుర్చీలో కూర్చోండి. మీరుకూడా టిఫిన్ తీసుకోండి!" అన్నాడు గౌరవంగా.

"మేం ఇప్పుడే ఆ కార్యక్రమం పూర్తిచేసి వచ్చాము!" అన్నాడు కృష్ణమూర్తి.

"పోనీ కాఫీయేనా త్రాగండి. కాఫీ యెన్ని సార్లు పుచ్చుకోడానికైనా ఎవరికీ అభ్యంతర ముండరాదు!" అన్నాడు ఉమాకాంతం.

తను టిఫిన్ తీసుకుని కాఫీ త్రాగిన పిమ్మట తన కుర్చీ కృష్ణమూర్తి దగ్గరకు లాక్కుని ఒక్కసారి ఎగాదిగా నూతన స్త్రీవైపు చూచాడు. ఉమాకాంతం రకరకాల స్త్రీల చూచిన వ్యక్తి కావడంవల్ల, ఎంత సౌందర్యవతినైనా పరీక్షగా చూడగలధైర్యమతనికుంది. అతను కాబోయే దర్శకుడు కావడంవల్ల అతని చూపు వనిత లెవ్వరూ అపార్థం చేసుకోక, అతని కృపామృతం కోసం కాంక్షిస్తారు.

"కృష్ణమూర్తిగారూ! ఈమె పేరేమిటి?" అన్నాడు దర్శకుడు, సూటిగా ఆమెతో మాట్లాడ్డం భావ్యంకాదని భావించి.

"నా పేరు సరస్వతి!" అన్నదామె పంచమ స్వరంతో.

"మీ కంఠస్వరం వింటే మీరు చక్కగా పాడగలరనుకుంటున్నాను. మీ ముఖం కూడా సినిమాలకు సరిపోతుంది. అయితే ఒకటే చిక్కుంది. కృష్ణమూర్తిగారి పోషణలో నున్న మీరు సినిమాలలో నాయకుడిప్రక్కన స్వేచ్ఛగా నటించడం కృష్ణమూర్తిగారి కంగీకారమౌతుందా? అని నా అనుమానం! సినిమాలలో నటీమణులు పురుషులతో యెంత చనువుగా నటిస్తారో మీకు తెలియనిది కాదు. ప్రేమ ఘట్టాలలో నాయికా నాయకులు నిజంగా ప్రేమికులవలె ప్రవర్తింప వలసి వుంటుంది" అన్నాడు ఉమాకాంతం.

"అన్నింటికి సిద్ధమైనవాళ్ళే సినిమాలలోకి వస్తారు" అన్నది సరస్వతి—తానంత సౌందర్యవతిగా కనిపించినా, తాను కూడా సామాన్య స్త్రీనేనని తెలియచేసే ప్రయత్నంలో.

"నేనివాళ తీసుకున్న ఇరువురు స్త్రీలు మాతోనే వుంటారు. మేము షేర్లు అమ్మదలిచాము. షేర్ల అమ్మకం పూర్తిచేసుకునే దాకా మీరు కూడా మా వెంటనుంటే బాగానే వుంటుంది. మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు ఉమాకాంతం కృష్ణమూర్తివైపు తిరిగి.

"నాకేమో వ్యాపారం వుంది. నేను లేకపోతే పనిసాగదు. ఆమె నావెంటలేకుండా బయలుదేరదు. కనుక, మీరు టాకీకి రిహార్సల్స్ ప్రారంభం చేసేముందు నాకు లేఖ వ్రాస్తే, మేం వెంటనే మద్రాసు బయలుదేరివస్తాము. ఈలోపుగా నా హోటలు మరొకరికి అద్దెకిచ్చేస్తాను. అదీ నా వుద్దేశ్యం! మీరీమెకు పెద్దగా ధనమివ్వ నవసరం కూడా లేదు. ఆమెకో ముఖ్యపాత్ర నిచ్చి చక్కగా నటింపచేయాలని నా కోరిక!" అన్నాడు కృష్ణమూర్తి.

"సరే. అలాగే చేస్తాను. మరి మీరు కూడా షేర్లేమైనా తీసుకుంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం" అన్నాడు దర్శకుడు.

"ప్రస్తుతం వ్యాపారం లాభసాటిగా లేదు. ఈ విషయం ఆలోచించి మీకు తెలియచేస్తాను. ఒక పాట పాడితే వినగలరా?" అన్నాడు కృష్ణమూర్తి.

"సినిమాలలో పాటలు వేషాలు ధరించేవారు పాడటంలేదు. అన్ని పాటలు-అవసరమైతే మాటలు కూడా-ప్లేబాక్ వే! కనుక సంగీత పరీక్ష అవసరంలేదు. అసలు సినిమాలకు అందగత్తెలు అవసరంలేదు. ఫొటోగ్రాఫీలో చక్కగా కనిపించే ముఖభంగిమలుంటే చాలు!" అన్నాడు ఉమాకాంతం.

ఏవో పాటలు కూడా పాడాలని యెంతో ఉత్సాహంతో వచ్చిన సరస్వతికి ఆశాభంగం కలిగింది దర్శకుడు మాటలు వినేసరికి. తానొకరి పోషణలో నుండటంవల్లనే, దర్శకుడు అలా మాట్లాడివుంటాడని ఆమె భావించింది. కృష్ణమూర్తి, ఆమె కలిసి గుర్రంబండిలో వెళ్ళిపోయిన కొంచెంసేపటికి రమాకాంతం ఇరువురు స్త్రీలతో ఒక బండిలో బంగళాకు వచ్చాడు.

"ఏంరా నిన్ను అయిదింటికి రమ్మంటే, నాలుగింటికే వచ్చావు?" అన్నాడు ఉమాకాంతం రమాకాంతం వెంట వచ్చిన స్త్రీలని చూడక.

"ఏం చేయమంటావు మామయ్యా! మా యింటి ముందు వందమంది గుంపుపోగయి నన్ను వేధించారు రికమండేషన్ చేయమని. ఆ జనంలో నుంచి నీ మోస్తరుగానే నేను ఇరువురు స్త్రీలను ఏరి తీసుకవచ్చాను" అని వసారాలో నిల్చుని వున్న స్త్రీలనుద్దేశించి "రండమ్మా లోపలికి" అన్నాడు రమాకాంతం.

దర్శకుడు ఆశ్చర్యంతో నవ్వి లోనికి వచ్చిన ఇరువురు స్త్రీల సౌందర్యాన్ని తిలకించి "మీరు షేర్లేమైనా తీసుకోగలరా? షేరు ఖరీదు వెయ్యి రూపాయలు" అన్నాడు వ్యాపార దృష్టితో.

"మావద్ద వెయ్యి రూపాయ లెక్కడివి- మునిసిపల్ గరల్స్ స్కూల్ మాస్టరు పని చేసే వాళ్లకి తిండి గడవడమే అంతంత మాత్రమని మీకు తెలుసుగదా? మమ్మల్ని సినిమాలోకి బుక్ చేసి మమ్మల్ని తారల్ని చేస్తారనీ, మేం తారలమై వేలు, లక్షలు గడించగలమనే ఆశతో వచ్చామండీ!" అన్నది స్థూలంగానున్న స్త్రీ ధైర్యంగా.

"బాగానేవుంది. మీరందరూ తారలు కావాలనుకుంటున్నారు. తారలు కావడానికికూడా డబ్బు పెట్టుబడి అవసరం. మీరు చేస్తున్న ఉపాధ్యాయిని ఉద్యోగానికికూడా మీరెంతో డబ్బు ఖర్చుచేసి చదువుకుంటేనే గదా సాధ్యపడింది. కనక డబ్బు పెట్టుబడి పెట్టలేనివాళ్ళు మా కనవసరం!" అన్నాడు ఉమాకాంతం విసుగ్గా.

"ఈ అబ్బాయి మీ మేనల్లుడుట నిజమేనా? మీ సహాయదర్శకుడనని చెప్పాడు!" అన్నది వచ్చిన రెండో స్త్రీ.

"అవును. ఏం? మీవద్ద లంచ మేమైనా పుచ్చుకున్నాడంటారా?" అన్నాడు ఉమాకాంతం.

"లేదు. అతనిమాట మీరు వింటారని తెలిసి రెండు రూపాయలు ఖర్చుచేసి వచ్చాం!" అన్నది రెండో స్త్రీ.

"ఆడబ్బు యిమ్మంటారా నన్ను? అది వీలు కాదు. సినిమాలలో చేరాలని వేలకువేలు ఖర్చు చేసుకుని మద్రాసులో వేలాదిజనం వుంటున్నారు. వాళ్ళసంగతేం చెప్పాలి?" అన్నాడు ఉమాకాంతం నిర్మొగమాటంగా.

"మాకు రెండురూపాయి లిస్తే, మీకు వచ్చే నష్ట మేముంటుంది?" అని ప్రశ్నించింది మొదటి స్త్రీ.

"ఇవ్వకపోతేమటుకు వచ్చే నష్ట మేముంది? నేనుగాని; నా మేనల్లుడుగాని మిమ్మల్నిక్కడకు రమ్మనలేదు! పొండి" అన్నాడు ఉమాకాంతం.

"మీరంత అగౌరవంగా మాట్లాడితే, ఏం చేస్తాం? మీకీవూళ్లో షేర్లు అమ్ముడుపోవాలంటే, మా సహాయం మీ కమితావసరం. మే మెరగని పురుషు లీగ్రామంలోలేరు!" అన్నది మొదటి స్త్రీ.

"ఈ వూరంతా మీ అధీనంలో వుందంటే ఎవరూ నమ్మరు! మీరు సామాన్య ఉపాధ్యాయినులు! మీరింత డాబుచేయడం! అందులో నాముందా? హనుమంతుడి ముందు కుప్పిగంతు లంటారు!" అన్నాడు ఉమాకాంతం.

ఇంతసేపూ మౌనంగా వున్న రమాకాంతం "ఇళ్ళకు పొండమ్మా! టాకీ ప్రారంభకావడానికి ఇంకా రెండుమాసాల టైముంది. తరవాత మీకు లేఖలువ్రాసి మద్రాసుకు పిలిపించగలం పొండి!" అన్నాడు ఉపాయంగా.

"అవును. అప్పుడు మిమ్మల్ని తీసుకవెళ్తాం!" అన్నాడు ఉమాకాంతం మేనల్లుడితో ఏకీభవిస్తూ.

"మీ అడ్రెసు లివ్వండి!" అని రమాకాంతం వారి చిరునామాలు తీసుకుని "నాదీ వూరే! నే నీవూళ్ళోనే వుంటాను. మా మామయ్య టాకీలో మీ ముఖాలు కనిపిస్తాయి. పొండి" అన్నాడు చాకచక్యంతో. వాళ్ళు అంతతో సంతృప్తిపడి వెళ్ళిపోయారు.

"నువ్వు బలేవాడివిరా! నీకు తోచినమాత్రం ఉపాయం నాకు సమయానికి, స్ఫురించలేదు సుమా!" అన్నాడు ఉమాకాంతం మేనల్లుడిని ప్రశంసిస్తూ.

"నీ వీవూరు రావడంగూర్చి అందరికీ తెలిసింది కాదూ అందరూ నావెంట పడుతున్నారు: నేను నీమోస్తరే షేర్లసంగతి చెప్పగానే, వాళ్ళు డంగయి తెల్లముఖాలు వేస్తున్నారు. డబ్బివ్వడానికి సాహసంలేదు కాని అందరూ సినిమాలలో నటించి లక్షలు గడిద్దామని దురాశ ఎక్కువైంది. ఆ నలుగురు కుర్రాళ్లయినా వచ్చి షేర్లు తీసుకొని కొంతసొమ్మి యిస్తే, నీ వీవూరు వచ్చిన పనిలో కొంతభాగం నెరవేరినట్లు భావించవచ్చు" అన్నాడు రమాకాంతం.

"వాళ్ళని నీ వెరిగుంటే కాస్త ప్రయత్నించు, మళ్ళీ యిక్కడికి పిల్చుకరా. మనతార లిరువురినీ ఈ క్రొత్త దుస్తుల్లో చూస్తే, వాళ్ళేదారికి వస్తారు!" అన్నారు ఉమాకాంతం.

"మామయ్యా! నీకో రహస్యం చెబుతాను వింటావా? ఉదయం వచ్చిన అంతమంది జనంలో నుంచి ఏరుకున్న వీళ్ళిద్దరూ యీవూరి యువకుల

అభిరుచులకు చాలరు మామయ్యా! నువ్వు యిక్కడ వున్నన్నాళ్ళూ ఇంకా, ఇంకా జనం వచ్చి సినిమాలలోకి వస్తామని నన్నూ, నిన్నూ వేధిస్తారు. పాపం! ఆ కృష్ణమూర్తి ఇంతకు ముందే కనిపించాడు. అతని ముఖాన నెత్తురు చుక్క లేదు" అన్నాడు రమాకాంతం.

"అలాగా! సరే-కాని నువ్వానలుగురి యువకుల్లో ఎవరు కనిపించినా సరే యిలా పిల్చుకరా" అన్నాడు ఉమాకాంతం.

ఈ లోకంలో కొందరితరులపనులు తమ పనులుగా భావించి కష్టపడుతుంటారు. వారిలో రమాకాంతం ఒకడు. తొరలుగా ఎన్నిక కావడానికివచ్చిన ఆ మహాజనంలో ఉద్భవిల్లిన ఆ నలుగురు యువకులకోసం అతను ఊరంతా గాలించసాగాడు. ఎదురుపడిన ప్రతివ్యక్తి ముఖం ఎగాదిగా పరికించాడు. వాళ్ళ ముఖాలు అతనికి బాగా గుర్తులేదనవచ్చు, ఆకస్మికంగా కాసేపు చూచిన వ్యక్తుల్ని చిరకాలం జ్ఞాపకంలో వుంచుకోవడం ఎవరికైనా కష్టమే. ఉమాకాంతం బంగళాలోకూర్చొని మేనల్లుడిద్వారా వాళ్ళ ఆచూకీ తెలియక చాలా ఆందోళనపడ్డాడు. తను వెంట తెచ్చిన మూడువందల రూపాయలలో సగం ఆడవాళ్ళిద్దరి దుస్తులకూ, టాయిలెట్టుకూ ఖర్చయింది. ఇక మిగిలింది మద్రాసుకి తిరుగు ప్రయాణానికి బొటాబొటిగా సరిపోయేడబ్బుమిగిలింది. క్రొత్త వూళ్లో డబ్బు అప్పెవరిస్తారు? మేనల్లుడు రమాకాంతం ఆస్తిపరుడుకాడు. కృష్ణమూర్తికి హోటలుబిల్లుతాలూకుడబ్బు చెల్లించడానికే తన వద్ద డబ్బులేదు. అందువల్ల అయిదురోజులుందామనుకున్న దర్శకుడు మూడోరోజునే ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోయాడు. బంగళావాడి అద్దెమాత్రం పూర్తిగా చెల్లించాడు. నాలుగోనాడుదయం కృష్ణమూర్తి హోటల్లో అలజడి ప్రారంభమైంది. బంగళాకు పంపిన టిఫిన్ కాఫీ తిరిగిరావడంతో, కృష్ణమూర్తి గుండెల్రబడినాయి.

వెంటనే అతను రిక్షాలో రమాకాంతం యింటికి వెళ్ళి అతనికి చెప్పాడు: "మీ మామయ్య వచ్చి దగాకోరు. మా హోటలుబిల్లు చెల్లించకుండా పారిపోయాడు! ఏ వూరు వెళ్ళిందీ నీకు తెలిసే యుంటుంది!" అన్నాడు కృష్ణమూర్తి.

"నాకేం తెలియదు. తిరిగి మద్రాసే వెళ్ళి వుంటాడు. షేర్ల అమ్మకంలో డబ్బు వస్తుందనుకున్నాడు. ఆ బాపతు కానీ కూడా రాలేదు. ఆయన అడ్రెసు నాకు తెలుసులే. నీ బిల్లు పైకం చెల్లించడానికి దగ్గర డబ్బులేక వెళ్ళివుంటాడు. ఆ ముండలిద్దర్నీ వెంట తీసుకుని వెళ్ళాడో లేదో-బంగళా జవాన్ని కనుక్కుంటాను! ఇంతకీ వాళ్లే అదృష్టం పండింది." అన్నాడు రమాకాంతం.

"నీ మాటలు నమ్మి మీ మామయ్య నిజాయితీ గలవాడనుకుని డబ్బుకిబ్బందిగా వుంటున్న రోజుల్లో దాదాపు వందరూపాయలు పైనఅప్పు పెట్టాను. ఈ డబ్బు వసూలుచేసే బాధ్యత నీపై వున్నది. మధ్యాహ్నం హోటలుకి ఒకసారిరా. ఘాటుగా ఉత్తరం రాద్దువుగాని!" అని కృష్ణమూర్తి రిక్షాలో వెళ్ళిపోయాడు.

రమాకాంతం తాను సహాయ దర్శకుడయినట్లుగా వూళ్ళో మిత్రులందరికీ చెప్పాడు. తన మామయ్య ఎ తపని చేశాడు? అనుకుని జరిగిన సంగతంతా తన తల్లికిచెప్పాడు. ఆమెనవ్వి "వాడు కాలాంతకుడు! వాడు చిన్నప్పటినుంచి ఇంతే!" అన్నది తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు.

కృష్ణమూర్తి ప్రోత్సాహంతో రమాకాంతం వారానికి రెండు కవర్లు చొప్పున ఒక నెలరోజులలో ఉమాకాంతానికి ఎనిమిది రాశాడు. ప్రతి ఉత్తరంలో కృష్ణమూర్తి హోటలుబిల్లుతాలూకు పైకం వెంటనే పంపవలసిందనీ తను మద్రాసు రావడానికి తనకు వేరే పైకం పంపవలసిందనీ వ్రాశాడు. ఈ మోసాన్ని పేపర్లలో ప్రకటిస్తానని కృష్ణమూర్తి అంటున్నాడని రాశాడు ఆఖరి లేఖలో. కాని ఒక్క లేఖకుకూడా జవాబులేదు.

జీవితం రుచివంతం అవడానికి ఏవో కోరికలంటూ ఎప్పుడూ ఉండడం అవసరం. మన అవసరాలు గడుస్తూ, కాలం దొర్లిపోతున్నా, కొన్ని కోరికల్ని ఊహించుకుని వాటికోసం తాపత్రయపడడం మానవనైజం. కోరుకున్న వాటినే తెచ్చి పెట్టుకోవడంకంటె, ఉన్న వాటినే కోరుకోవడం సుఖవంతం.—జాన్సన్